విశాలాంధ్ర గుంటూరు జిల్లా

కళ్లజోళ్లు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : రామనాథం చిన్న కోటయ్య పార్వతమ్మ వృద్ధుల సేవా ఆశ్రమము అధ్యక్షులు రామ నాథం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం 100వ నేత్ర పరీక్ష, కళ్ళ జోళ్ళు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ మహబూబ్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందవ శిబిరంలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ధన్వరత్న ఆకురాతి శంకరరావు, పిరమిడ్ మాష్టారు దీపాల సాంబశివరావు, పుట్ట ఏడుకొండలు, పుట్టా లక్ష్మి, కవితా, రామచంద్ర మిషన్ సంస్థ ప్రతినిదులు చిన్నగిరి మంజుదేవి, ఈమని కామేశ్వరరావు, సేతు మాదవి కుమారి అందరి చేత గీత ధ్యానం చేయించారు. స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర-పెదకాకాని : తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపుమేరకు సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు పొన్నూరు నియోజకవర్గం పెదకాకాని గ్రామం మెయిన్ రోడ్డు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర మండల టీడీపీ నాయకులు ఆదివారం సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా దీక్షలు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ప్రత్తిపాడు భవాని కాంప్లెక్స్‌లో పార్టీ కార్యకర్తలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామాంజనేయులు హాజరై ప్రభుత్వ నిరంకుశ విధానాలను దుయ్యబట్టారు. చంద్రబాబును అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గింజుపల్లి శివరామ ప్రసాద్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర- తాడేపల్లి : 22వ వార్డు మహానాడు 1వ రోడ్డులో శ్రీ కృష్ణా ద్వారకా సేవా సమితి, రాయల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వ ర్యంలో ఆదివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీకృష్ణునికి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అలాగే మధ్యాహ్నం 10 వేల మంది భక్తులకు అన్నదానం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఉట్టి కొట్టుట, కోలాటం, నృత్యాలు, బొల్లావుల సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ ద్వారక సేవా సమితి కమిటీ సభ్యులు, రాయల్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బురదలో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు

విశాలాంధ్ర-తుళ్లూరు : విజయవాడ నుంచి అమరావతి వెళ్లే ఆర్టీసీ బస్సు తుళ్లూరు స్కీమ్ బిల్డింగ్ వద్ద ఆదివారం గుంతలో కూరుకుపోయింది. తుళ్లూరు నుంచి అమరావతి వెళ్లే రహదారి అధ్వాన్నంగా తయారై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలు కురవడంతో గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారింది. ఆదివారం మధ్యాహ్నం తుళ్లూరు నుంచి అమరావతి వెళుతున్న బస్సు బురదలో ఇరుక్కుపోయింది. ట్రాక్టర్ సాయంతో బయటకు తీసే ప్రయత్నం చేసినా సాధ్య పడలేదు. ఇలాంటి సంఘటనలు తరచు జరుగుతున్నా ఆర్టీసీ అధికారుల నుంచి స్పందన లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు.

అమరావతి రైతుల దీక్షలు

విశాలాంధ్ర-తుళ్లూరు : మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నా మని రాజధాని రైతులు, రైతు కూలీలు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, మందడం, వెలగపూడి గ్రామాలలో అమరావతి రైతుల దీక్ష శిబిరంలో చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ సామూహిక నిరాహార దీక్షలను చేపట్టారు. సాయంత్రం 5 గంటలకు దీక్ష విరమించారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు మండల పరిధిలోని రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

అడ్డరోడ్డులో టీడీపీ దీక్ష

విశాలాంధ్ర-తాడికొండ : చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిన నేపథ్యంలో స్థానిక అడ్డరోడ్డు సెంటర్‌లో ఆదివారం కూడా నియోజకవర్గ స్థాయిలో టీడీపీ నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. జగన్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బెయిల్ ఇచ్చేంతవరకు తమ దీక్షలను కొనసాగిస్తామని టీడీపీ నాయకులు స్పష్టంచేశారు. ప్రధానంగా ద్వితీయ శ్రేణి నాయకులు మాత్రమే దీక్షలో పాల్గొన్నారు. ఎలాంటి విధ్వంస ఘటనలు జరగలేదు. కార్యక్రమంలో తాడికొండ మండల టీడీపీ అధ్యక్షులు తలసిల ప్రసన్నకుమార్, తుళ్లూరు మండల అధ్యక్షులు దనేకుల సుబ్బారావు, మేడికొండూరు మండల అధ్యక్షులు మర్రిపెద్ది రమేష్, ఫిరంగిపురం మండల అధ్యక్షులు మండవ చిన్న నరసింహారావు, 150 మంది పైగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ రాములమ్మతల్లి కొలుపులు

విశాలాంధ్ర-చేబ్రోలు: కనుల పండువగా శ్రీ రాములమ్మ తల్లి కొలుపులు ఆదివారం జరిగాయి. చేబ్రోలులో వేంచేసి ఉన్న గ్రామ దేవత శ్రీ రాముల మ్మతల్లికి ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో భక్తులు పొంగళ్లు పొంగించి, మెక్కుబడులు చెల్లించుకోవటం పూర్వకాలం నుంచి వస్తుంది. శ్రావణమాసం ప్రారంభం నుంచి ప్రతి ఆదివారం అమ్మవారికి గ్రామంలోని భక్తులు కోళ్లు, పొటేళ్లు, సమర్పిస్తు తమను, తమ గ్రామస్తులను సుఖ:సంతోషాలతో ఉండే విధంగా చూడాలని అమ్మవారి కి మెక్కులు చెల్లిస్తుంటారు. శ్రావణమాసం చివరి ఆదివారం కావటంలో గ్రామంలోని భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోని తమ మెక్కుబడులు చెల్లించుకున్నారు.

ప్రాణాలు తీసుకోవడమే సమస్యలకు పరిష్కారం కాదు

విశాలాంధ్ర-పెదనందిపాడు : చిన్న సమస్యలను ఎంతో పెద్దవిగా ఊహించుకొని జీవితాన్ని అర్ధాంతరంగా ముగించడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదని, ప్రాణాలు తీసుకోవడమే సమస్యలకు పరిష్కారం కాదని ఎస్టీయూ గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షులు గేరా మోహనరావు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా పెదనందిపాడు శాఖ గ్రంథాలయంలో విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోహన రావు మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న ఆత్మహత్యల ద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు, సమస్యలపై అవగాహన కలిగించేందుకు ప్రతి ఏటా సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివా రణ దినోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. వేర్వేరు కారణాలతో భారత్ సహా ఎన్నో దేశాలలో ఏటా కొన్ని వేల మంది బల వన్మరణాలకు పాల్పడుతున్నారని, దీనివల్ల అసంఖ్యాక కుటుంబాల్లో తీరని ఆవేదన కలుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆత్మహత్య ఆలోచనలు వచ్చినప్పుడు కుటుంబం, జీవిత ఆశయాల గురించి ఆలోచించాలని, విపరీత నిర్ణయాలు తీసుకుంటే తమపై ఆధారపడిన వారు ఎలా ప్రభావితం అవుతారో ఆలోచించాలని, మనసు బాగాలేని సమయంలో గతంలో కుటుంబం, పిల్లలు, స్నేహితులతో గడిపిన క్షణాలను గుర్తు తెచ్చుకోవాలని, కాలమే సమస్యలన్నిటికీ పరిష్కారం చూపుతుందనే నమ్మకాన్ని కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథా లయ నిర్వాహకురాలు పి.సుభాషిని, విశ్రాంత ఉపాధ్యా యులు గారపాటి రమేష్, జి.వెంకటేశ్వర్లు, కె.మంజుల, ఎ.సురేష్, కె.రాజబాబు పాల్గొన్నారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో కొనసాగించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరే షన్: వడ్డెర్లను ఎస్టీ జాబితాలో కొనసాగించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీనికి రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా కృషి చేయాలని రాష్ట్ర వడ్డెర ముఖ్యనాయకుల సమావేశం తీర్మానించింది. స్థానిక అరండల్‌పేటలోని వడ్డెర కమ్యూనిటీ కార్యాలయంలో రాష్ట్ర వడ్డెర కుల నాయకులు సమావేశం రాష్ట్ర నాయకలు తురకా రామారావు, కుంచాల కృష్ణ కిశోర్‌ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డీఎన్‌డీ బోర్డు సభ్యుడు తురకా నరసింహారావు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ళ రేవతి, బందారు షరాబంది రాజు, తన్నీరు ఆంజనేయులు, వల్లెపు ముసలయ్య తదితరులు మాట్లాడారు. స్వతంత్ర్యం వచ్చి 77 ఏళ్ళు గడిచినప్పటికీ వడ్డెర్ల స్థితిగతులు ఏమాత్రం మారలేదని, రాజకీయ పార్టీలు వడ్డెరలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1972 సంవత్సరానికి ముందు వడ్డెరలు ఎస్టీ జాబితాలో కొనసాగారని, అనంతరం వచ్చిన ప్రభుత్వాలు ఎస్టీ జాబితా నుంచి తొలగించి తమను ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అణగదొక్కాయని, వడ్డెరలను ఎస్టీ జాబితా చేర్చంత వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వడ్డెరలంతా ఏకమై పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బెల్లంకొండ శ్రీనివాస్, మాధవి, కుంచాల కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుట్రలో భాగమే చంద్రబాబు అరెస్ట్ : కోవెలమూడి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరే షన్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన అవినీతి మరకను ఇతరులకు అంటించేందుకు పన్నిన కుట్రలో భాగమే టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ కోవెలమూడి రవీంద్ర, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ ధ్వజమెత్తారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ స్థానిక గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ కార్యాలయంలో టీడీపీ శ్రేణుల ఆదివారం సామూహిక నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా కోవెలమూడి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని నిలదీయడంతో పాటు, ప్రభుత్వ తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టడాన్ని ముఖ్యమంత్రి కక్షసాధింపు చర్యలకు దిగారని దుయ్యబట్టారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షాల మీద దాడి చేయటంలో చూపే శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధి మీద చూపిస్తే ఆంధ్ర రాష్ట్రానికి ఈ ఖర్మ పట్టేది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ నిమ్మల శేషయ్య, కార్పొరేటర్లు మానం పద్మశ్రీ, భారతి, బాలాజీ శ్రీరామ్ ప్రసాద్ (బుజ్జి), వజ్జా లక్ష్మి, విజయలక్ష్మి, అనిత, వాణి, మల్లికా, ముత్తినేని రాజేష్, గొల్ల ప్రభాకర్, మార్కండేయులు, మానంశ్రీనివాస్, పవన్ కుమార్, వట్టిచెరుకూరు మండల పార్టీ అధ్యక్షులు పూర్ణ చంద్ర రావ్, విఠల్, రామినేని వెంకటరావు, మైనార్టీ నాయకులు నజీర్, లాల్ వజీర్ తదితరులు పాల్గొన్నారు.

సైడ్ ఎఫెక్ట్ లేని వైద్యం 'హోమియోపతి'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక అరండల్‌పేట 4వ లైన్‌లో ఉన్న పుండరీ కాక్షయ్య పార్కు నందు డాక్టర్ కేర్ (హోమియోపతి) అధినేత, ఇండియన్ నెంబర్-1 ఆటిజం స్పెషలిస్ట్ ఏఎం రెడ్డి సహకారంతో గుంటూరు బ్రాంచ్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన 64 మంది పేషంట్లకు హోమియోపతి వైద్య నిపుణురాలు డాక్టర్ సాధిక బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ సాధిక మాట్లాడుతూ నేటి ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా హోమియోపతిలో మంచి వైద్య సౌకర్యాలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేని వైద్య సేవలు హోమియోపతికే చెల్లిందన్నారు. డయాబెటిక్ సమస్యలకు, కీళ్ళ నొప్పులకు, ఫైల్స్, ఫిస్టులా, చర్మ సమస్యలకు, కిడ్నీ, మేల్ సెక్సువల్ సమస్యలకు, తల నొప్పికి హోమియోపతిలో అతి తక్కువ ధరలో మంచి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో వివిధ సమస్యలతో బాధపడుతున్న పేషెంట్లు హోమియోపతి మందులు వాడి తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఈ మెడికల్ క్యాంపులో గుంటూరు బ్రాంచ్ మేనేజర్ గోవర్ధన్, పిఆర్‌ఓ పావని, సిబ్బంది ఈశ్వంత్ రెడ్డి, ధనలక్ష్మి ఉన్నారు.

విద్యా పారితోషిక ప్రదానోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి ప్రాంగణంలో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి విద్యా పారితోషిక ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షులు ఆర్.లక్ష్మీపతి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రవి వడ్లమాని విచ్చేసి ప్రతిఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత స్థానం పొందిన తరువాత సమితి వారికి సహాయ సహకారాలు అందజేయాలని, తద్వారా ఇంకా ఎక్కువ మంది విద్యార్థులకు పారితోషము అందచేయవచ్చునని తెలిపారు. నగర్ మేయర్ కావటి మనోహర్ నాయుడు సేవాసమితి వారు చేస్తున్న సేవలను అభినందించారు. స్థానిక కార్పొరేటర్ ఈచంపాటి వెంకట కృష్ణమాచారి విద్యార్థులు బాగా చదువుకొని మంచి స్థానాలు పొందాలని ఆకాంక్షించారు. సుమారుగా రూ.10 లక్షలను 152 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని సేవా సమితి కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్ పర్యవేక్షించారు. సమితి సభ్యులు సంజీవరావు, వినోద్ కిరణ్, రామకృష్ణారావు, వెంకటకృష్ణ, మంగాదేవి, కోశాధికారి బాలకృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీనాథ్, కోదండ రామారావు, పి.మురళి, పాండురంగరావు, ఆదిరాజు శ్రీధర్ పాల్గొన్నారు.

మతతత్వ విధానాలే దేశాభివృద్ధికి ఆటంకం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మతతత్వ విధానాల వలనే దేశాభివృద్ధికి ఆటంకం కలుగుతుందని, భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ గొప్పతనం అని ముస్లిం జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ కలీం అన్నారు. 'సర్వమత సమానం-భిన్నత్వంలో ఏకత్వం-మన దేశం'అను నినాదంతో 'విద్వేషానికి ఆహుతి అయ్యేది మతాలు కాదు-దేశం' అనే అంశంపై గుంటూరు నగరంలోని హై స్కూల్స్, మరియు జూనియర్ కళాశాలల విద్యార్థులతో దేశభక్తి, లౌకిక భావం పెంపొందించేందుకు అవగాహన కార్యక్రమం ఈ నెల చివరి వారంలో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎల్బీ మార్కెట్‌లోని ముస్లిం జేఏసీ కార్యాలయంలో జరిగిన కమిటీ సభ్యుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. లౌకికతత్వ విధానాలతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని విద్యార్థుల్లో అవగాహన కల్పించుటకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రభుత్వ అధికారులను అతిథులుగా ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ముస్లిం జేఏసీ సభ్యులు మీర్జా హిదాయతుల్లా బేగ్, ఎండి అక్బర్ సయ్యద్ భాష, మస్తాన్ వలి, షేక్ బాజీ, యూసుఫ్ బేగ్, గఫార్ బేగ్, ఎండి హబీబ్. ఎండి నజీర్. ఎండి ఇనాయతుల్లా, అమానుల్లా ఖాన్. జబీబుల్లాతో పాటు పలువురు పాల్గొన్నారు.

రోగులకు వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆసుపత్రిలోని పోస్ట్ క్యాథ్ వార్డును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తనిఖీ సమయంలో ఎంఎన్‌ఓలుగా పని చేస్తున్న ఇద్దరికి డ్రెస్ కోడ్ లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్యూటీలో ఉన్న ఎంఎన్‌ఓలు ఇద్దరు డ్రెస్ కోడ్ లేకుండా ఉండటం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. డ్యూటీలో ఉండాల్సిన మెడికల్ డాక్టర్ అందుబాటులో లేరని దుయ్యబట్టారు. ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం కోట్లు ఖర్చు పెడుతోందని, ఆ డబ్బుతో వార్డు నిర్వహణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. పేద రోగులకు అండగా ఉండాలని ప్రభుత్వం కోట్లాది రూపాయల బడ్జెట్‌ను కేటాయిస్తోందని చెప్పారు.

నిర్మాణ రంగంలో నాణ్యతకే తొలి ప్రాధాన్యత

విశాలాంధ్ర-గుంటూరు : పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి నిర్మాణరంగం ప్రధాన పాత్ర పోషిస్తున్నదని బిల్డర్లు నాణ్యతతో కూడిన నిర్మాణాలను అందించడం ద్వారా ఖాతాదారుల అభిమానాన్ని పొంది వ్యాపార అభివృద్ధిని కొనసాగించవచ్చునని గుంటూరు పశ్చిమ శాసనసభ్యులు మద్దాలి గిరి అన్నారు. వాసవి కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఆత్మకూరి నాగేశ్వరరావు సారధ్యంలో స్థానిక పట్టాభిపురం ఒకటో లైన్‌లో అన్నపూర్ణ రెసిడెన్సి అపార్ట్మెంట్స్‌కు శనివారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైసీపీ నాయకురాలు నూరి ఫాతిమా తదితరులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. క్రేన్ గ్రూపు సంస్థల అధినేత జీవీఎస్ఎల్ కాంతారావు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు బాల వజ్రబాబు, షేక్ సజీల, జనసేన నాయకులు నేరెళ్ల సురేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు, బిల్డర్ శివారెడ్డి, బూసిరెడ్డి మల్లేశ్వర రెడ్డి, పలువురు నిర్మాణ రంగ, నగర వైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను తిప్పికొట్టాలి: డీబీఎఫ్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దళిత పల్లె వీరుల రక్షణ దళాలు ద్వారానే దళితులపై జరిగే దాడులను తిప్పి కొట్టాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. 77 యేళ్ల స్వాతంత్ర్యానంతరం కూడా దళితులపై దాడులు తగ్గలేదని, దళిత రక్షణ చట్టాలు, ప్రత్యేక న్యాయస్థానాలు భాదితులకు న్యాయం చేయలేకపోతున్న నేటి తరుణంలో ప్రతి గ్రామంలో దళిత పల్లె వీరులు రక్షణ దళాలను ఎర్పాటు చేసుకొని తమపై జరిగే దాడులను తిప్పికొట్టాలన్నారు. స్థానిక అరండల్‌పేటలో ఉన్న రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల భవన్‌లో చుండూరు పల్లె వీరుడు కొమ్మిర్ల అనిల్ కుమార్ 32వ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీబీఎఫ్ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సమావేశం జరిగింది. కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ దళితుల రక్షణ బాధ్యత దళితులే ఎర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. 32 సంవత్సరాల క్రితం 8 మంది దళితులను దారుణంగా చంపిన చుండూరు హంతకులను శిక్షించకపోవడం దళితుల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అంగడాల పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అంబేద్కర్ సిద్ధాంత పునాదితో దళిత బహుజన రాజకీయ్య ఉద్యమ నిర్మాణానికి దళిత బహుజన ఫ్రంట్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తుందన్నారు. డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి భాగ్యారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు, పార్టీల రాజ్యాంగ వ్యతిరేక విధానాల మూలంగా దళిత బహుజన వర్గాల ఉనికికే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో జాలాధి మోజెస్, దేవరపల్లి వీరయ్య, చుక్క సుశీలరావు, బుస్సా రత్నప్రసాద్, కొసనం రాము, భూపతి సునీల్ కుమార్, పొందుగల ప్రకాష్, ఐలా మాణిక్యరావు, సాతులూరి రామాంజయనేయులు, ఉన్నం సుధాకర్ రెడ్డి, రమణమ్మ, వద్దే మధుసూదనరావు, సంకురి రాజారావు, వేముల విజయ్, కోడిరెక్క కోటిరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలికి కీర్తి తెచ్చిన కళాకారులు, దర్శకులు

విశాలాంధ్ర-తెనాలి : ప్రజాసమస్యల పరిష్కారాన్ని చూపుతూ ప్రజా నాట్యమండలి ద్వారా నాటక, నాటిక కళారూపాల రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శింప జేసిన దర్శకులు తాతినేని ప్రకాశరావు, కె.ప్రత్యగాత్మ, నటులు లక్ష్మీపెరుమాళ్ళు, వెంపటి రాధాకృష్ణా, పర చూరి హనుమంతరావు, రామకోటి, నృత్య దర్శకులు వేణుగోపా ల్‌లను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రజానాట్యమండలి వారిపై ఉందని ఆ నేపథ్యంలో వారికి నివాళులు అర్పించాలని వక్తలు పేర్కొన్నారు. అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమరకళాకారుల సంస్మరణ సభలు మూడవ రోజు ఆదివారం కొనసాగింది. సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరపల్లి నీలాంబ్రం అధ్యక్షత వహించారు. నటుడు, దర్శకుడు, నాటక విశ్లే షకుడు వంగా రంగారావు మాట్లాడుతూ వైజ్ఞానిక రంగం వినోదా నికి కాదు, విజ్ఞానానికని ప్రజలు ఎదుర్కొంటున్న కష్టనష్టాలతో కూడిన సమస్యలను కళారూపాలుగా రూపొందించి ప్రదర్శించిన కళాకారులు ఎందరో ఉన్నారని వారిని స్మరించుకోవడం మన విద్యుక్త ధర్మమని చెప్పారు. ప్రజల్లో నూతన చైతన్యాన్ని నింపి కమ్యూనిస్టు పార్టీకి, ప్రజానాట్యమండలికి కీర్తి ప్రతిష్టలు తెచ్చారని, వారు సూరపనేని లక్ష్మీపెరుమాళ్ళు, వెంపటి రాధాకృష్ణ, పరచూరి హనుమంతరావు, నృత్య దర్శకులు వేణుగోపాల్, రామకోటి, కోడూరు అచ్చయ్య, పురుషోత్తమ పాత్రుడు తదితరులు ఎందరో ఉన్నారని వారు జీవితాంతం కృషి చేశారని స్మృత్యాంజలి ఘటించారు. అధ్యక్షత వహించిన నీలాంబ్రం ప్రజాదర్శకులు తాతినేని ప్రసాదరావు, ప్రత్యగాత్మల గురించి మాట్లాడుతూ వారు కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్తగా చేరి సోషలిస్టు భావాలను ప్రజల్లో చొప్పించేందుకు వాడవాడలా విస్తృత ప్రచారం చేశారని అన్నారు. ప్రత్యగాత్మ ప్రజాశక్తి పత్రికలో జర్నలిస్టుగా పనిచేశారని, యువజన సంఘాల ఆర్గనైజర్‌గా పార్టీ కార్యక్రమాలు గ్రామాలలో నిర్వహించారని, పార్టీ నిషేధ సమయంలో మద్రాసు చేరుకొని సినీ రంగంలో రచన, దర్శక శాఖల్లో పనిచేశారన్నారు. భార్యభర్తలు, కులగోత్రాలు లాంటి భారీ చిత్రాలకు దర్శకత్వం వహించి ఉత్తమ దర్శకులుగా వెలుగొందారని చెప్పారు. సినీరంగంలో పనిచేస్తూనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారని వారికి నివాళులు అర్పించారు. తాతినేని ప్రకాశరావు కమ్యూనిస్టు పార్టీలో చేరి యువజనసంఘాలు, ప్రజానాట్యమండలి కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేవారని, నిషేధకాలంలో మద్రాసు చేరి సినీరంగంలో పల్లెటూరు, చరణదాసిలాంటి చిత్రాలకు దర్శకత్వం వహించి మంచి పేరు తెచ్చుకున్నారని, అనేకమంది కళాకారులకు చేయూతనిచ్చారని వారిని స్ఫూర్తిగా తీసుకొని నేడు యువత కమ్యూనిస్టు పార్టీ, యువజన సంఘాలను బలోపేతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నటి వాల్మీకి విజయలక్ష్మీ, బొల్లిముంత కృష్ణ, మాణిఖ్యాలరావు, దేవరపల్లి అభినవ్, విజయదుర్గ, శివకుమారి తదితరులు పాల్గొన్నారు. సభా ప్రారంభంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఉత్తమ సీడ్ కంపెనీగా వేద సీడ్స్‌కు అవార్డు

విశాలాంధ్ర-గుంటూరు : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ సీడ్ కంపెనీగా వేద సీడ్స్‌కు సీడ్స్ మెన్ అసోసియేషన్ అవార్డును అందజేసింది. ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సీడ్స్ మెన్ అసోసియేషన్ యాన్యువల్ అవార్డ్స్-2023 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ సీడ్ కంపెనీ విభాగంలో వేద సీడ్స్ కంపెనీ ఈ అవార్డును కైవసం చేసుకుంది. వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ గత 30 సంవత్సరాలుగా వ్యవసాయ పరిశోధనలో వారి చేసిన కృషిని అభినందిసూ ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి దుశ్శాలువాతో సత్కరించి ఈ అవార్డును అందచేశారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వేద సీడ్స్ ద్వారా నాణ్యమైన, అధిక దిగుబడులను అందించే హైబ్రిడ్ విత్తనాలను రైతుసోదరులకు అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని, అవార్డును అందచేసిన సీడ్స్ మెన్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్, తులసి విశ్వంభర్, వేద సీడ్స్ జనరల్ మేనేజర్ గుడి సతీష్ కుమార్, హెచ్ఆర్ మేనేజర్ తోట రంగారావు, జీఎం తాయి శ్రీనివాసరావు, పీఆర్ఓ ఇక్కుర్తి వెంకటేష్, గాజుల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తికే డాక్టర్ ప్రభావతి ఆదర్శం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైద్య రంగానికే తలమానికంగా నిలిచి ఎటువంటి క్లిష్టమైన జబ్బులనైనా ఇట్టే నయం చేస్తూ వైద్య వృత్తికే ఆదర్శంగా నిలిచిన వైద్యురాలు, జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. వైద్య రంగంలో విశిష్టమైన సేవలు అందించిన సందర్భంగా స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఆమెను ఆదివారం ఘనంగా సత్కరించారు. అనంతరం శివరామిరెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విసుగు, విరామం లేకుండా చిరు నవ్వులు చిందిస్తూ వచ్చిన రోగులకు మనో ధైర్యాన్నిస్తూ అందించిన సేవలు మరువలేనివన్నారు. డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతోనే జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా వైద్య సేవలందించగలిగినట్లు చెప్పారు. సమాజ సేవలో కూడా ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.సదాశివం, బాపయ్య చౌదరి, సత్యన్నారాయణ తదితరులు ఉన్నారు.

అంగలకుదురులో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-తెనాలి : మండలంలోని అంగలకుదురు గ్రామంలో వికార్డియాక్ & మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సర్జరీ, జనరల్ మెడిసెన్, గుండె వ్యాధి, ఊపిరితిత్తులు, గర్భకోశం వ్యాధులు, ఎముకలు, కీళ్ళు మొదలగు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు కొత్తమాసు సాంబశివరావు, శ్యామ్ ప్రసాద్, విజయవాణి, సురేష్, షేక్ తాజుద్దీన్, చందనలు షుగర్, బిపి, కీళ్ళు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లను గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అభినందించి సత్కరించారు. వివిధ గ్రామాల నుండి 400 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, వీరవల్లి మురళి, పిచ్చయ్య, విజయ, సాయిగిరి, వేణు, వెంకట్రామయ్య, హైమానంద్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో గ్రేడింగ్ పరీక్షలు

విశాలాంధ్ర, తెనాలి : తైక్వాండో అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా వారి ఆధ్వర్యంలో కె.యస్.ఆర్. తైక్వాండో అకాడమీ, తెనాలి నందు ఆదివారం తైక్వాండో గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డబుల్ హార్స్ మినపగుళ్ళు మేనేజర్ కృష్ణప్రసాద్, సునీల్, రామారావు, ఛీఫ్ ఎగ్జామినర్‌గా ఇంటర్నేషనల్ ఎక్షామినర్, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తైక్వాండో నేర్చుకోవడం వలన వారిలో క్రమశిక్షణ అలవడుతుందనీ, ఆరోగ్యంగా ఉంటారనీ, విద్యా, ఉద్యోగాలలో 3% రిజర్వేషన్స్ ఉంటాయనీ చెప్పారు. గ్రేడింగ్ పరీక్షలో 44 మంది విద్యార్థులు హాజరయ్యారని అన్నారు. పరీక్ష అనంతరం ఎల్లోరంగు బెల్టు, రెడ్ బెల్టు, ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విలేకర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై నిరసనలు

విశాలాంధ్ర, తెనాలి : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆదివారం రెండవరోజు తెనాలిలో విస్తృతంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణ ప్రధాన కేంద్రాలలో భారీగా వందల సంఖ్యలో ర్యాలీగా చేరుకొని నిరసనను నిర్వహించారు. అక్రమంగా చంద్రబాబును అరెస్టుచేయడం అన్యాయమని, భవిష్యత్తులో ప్రజలు ఈ చర్యలకు పూనుకున్న పార్టీకి తగిన బుద్ధి చెబుతారని నినాదాలు చేశారు. నిరసనకు ముందు పట్టణంలో వివిధ కూడలిల నుండి పార్టీ శ్రేణులు తెలుగుదేశం పతాకాలతో నిరసన ప్రదేశాలకు చేరుకున్నారు. తాడిబోయిన హరిప్రసాద్, మహ్మద్ కుద్దూష్, కంచర్ల యేదుకొండలు, డా.రామకృష్ణ, ప్రభృతులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన విశాఖపట్టణం సిటీ, ప్రస్తుతం 2వ లైను, రాజేంద్రనగర్ గుంటూరు కాపురస్థులు కూనం వీర భద్రరావు, S/o.కోటయ్య గారి సూచనల మేరకు తెలియజేయునది ఏమనగా, నాక్లయింటు ది.08-09-2023న దిగువ షెడ్యూలు ఆస్తికి చెందిన పార్టీషన్ దస్తావేజు నెం.12225/2021 యస్.ఆర్.ఓ.గుంటూరు గల దస్తావేజును తీసుకొని గుంటూరు ఆర్.టి.సి.బస్టాండ్ కార్గోలో పార్సిల్ తీసుకొనుటకు వెళ్ళి తిరిగి వచ్చు క్రమంలో సదరు డాక్యుమెంట్‌ను పోగొట్టుకోవడం జరిగినది. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ దిగువ అడ్రస్ నందు గాని లేదా నాక్లయింటుకు గాని అందజేసిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును. అట్లు గాక సదరు దస్తావేజును ఎవరైనా దుర్వినియోగం చేసినయెడల నాక్లయింటు తీసుకొను చట్ట పరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులౌదురు.

షెడ్యూలు: గుంటూరు డి॥ & సబ్.డి॥, జి.యం.సి. ఏరియా, పాతగుంటూరు, కొత్తవార్డు నెం.10, బ్లాక్ నెం.2, టి.యస్.నెం. 15/డి దక్షిణపు వైపు 3-19253 చ.అ.మింజుమలి దక్షిణం వైపు చ.గ.4995.725 ఖాళీ నివేశన స్థలం.

వి. నాగేశ్వరరావు, అడ్వకేట్
గుంటూరు. సెల్: 9032061847

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

అవినీతి మచ్చలేని నాయకుడు పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర-గురజాల: దశాబ్ద కాలంగా రాజకీ యాల్లో ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలపై గళమె త్తుతూ సామాన్య ప్రజలకు భరోగా నిలుస్తున్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అవినీతి మచ్చ లేని నాయకుడు అని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కటికం అంకారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారమే పవన్ కళ్యాణ్ మంగళగిరి పార్టీ కార్యాలయనికి వచ్చారని, వారహి నాలుగో దశకు సంబంధించిన విషయాలు, పార్టీ భవిష్యత్తు కార్యా చరణ గురుంచి నాయకులతో చర్చించేందుకు పవన్ కల్యాణ్ మంగళగిరి పార్టీ ఆఫీసుకి వస్తుంటే రాష్ట్ర పోలీసులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేయ డం హేయమైన చర్య అని అన్నారు. పవన్ కళ్యాణ్ ఏమి నేరం చేసారని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసారని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్ట్ ను ఒక పార్టీ అధినేతగా ఆయన ఖండించారు. ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారని రాబోవు రోజుల్లో వైసిపిని గద్దె దింపటం ఖాయమని అన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 త్యాళ్ళూరు గ్రామంలో బేడ బుడగ జంగాల ఇలవేల్పు శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఆది వారం ఘనంగా నిర్వహించారు. బేడ బుడగ జంగాల కాలనీలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ తల్లి పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా క్రోసూరు వ్యవ సాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. సొసైటీ చైర్‌పర్సన్ కల్లి శ్రీనివాసరెడ్డి, బుడగ జంగాల కుల పెద్దలు కృష్ణమూర్తి, అచ్చయ్య, భిక్షా లు, ఆంజనేయులు, బ్రహ్మం, శ్రీనివాసరావు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

తేళ్ళ నిర్మలా భాస్కర్‌కు ఘనసత్కారం

విశాలాంధ్ర-వినుకొండ: ఉపా ధ్యాయ దినోత్సవం నాడు కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా శావ ల్యాపురం జడ్పీహెచ్ హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయురాలు తేళ్ళ నిర్మలా భాస్కర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక ఇమ్మానియేల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన అభినందన సభలో సంఘ సభ్యులు తేళ్ల నిర్మల భాస్కర్ దంపతులను దృశ్యాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారిని జిల్లా జడ్పీ కో ఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్ అభి నందించారు. వారు మాట్లాడుతూ ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా సేవలు అందిం చి ప్రస్తుతం శావల్యాపురం జడ్పీహెచ్ హైస్కూల్లో విధులు నిర్వహిస్తున్న నిర్మల భాస్కర్ ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారని వారి సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ అవార్డు అందించడం జరిగిందని అన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-వినుకొండ: ఒక్క క్షణం ఆలోచిస్తే బంగారు భవిష్యత్తు మీదే అని ఆవేశాలకు లోనై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని మీ కుటుంబం గురించి మీరు పొందబోయే అద్భుతమైన జీవితాన్ని గురించి ఆలోచించాలని స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం సెక్రటరీ నాగాంజనేయులు మరియు వినుకొండ బీఈడీ కళాశాల డైరెక్టర్ గాలి శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి క్షణిక ఆవేశాలకు లోనై అందమైన జీవితాన్ని పాడు చేసుకోవద్దని, చిన్న వయసులో ఓటమిని పొందిన వాడే గొప్ప విజేతగా నిలుస్తాడని ఎందరో మహానుభావులు ఇలాగే ఆదర్శవంతులుగా మారారని తెలియజేశారు. ఈ కార్యక్రమం డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస శర్మ మరియు ప్రిన్సిపాల్ శ్రీవల్లి పావని ఆధ్వర్యం వహించగా కళాశాల ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు జీవన లక్ష్యం సాధించేందుకు ఎంతో తోడ్పాటు అందిస్తాయని విద్యార్థులు సంస్కారవంతమైన విద్యను అభ్యసిస్తూ అందరికీ ఆదర్శవంతులుగా మీరు మారాలని కళాశాల డైరెక్టర్ తెలియజేశారు.

'సదరన్ ట్రావెల్స్' నూతన బ్రాంచ్ ప్రారంభం

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : గుంటూరు నగరంలోని లక్ష్మీపురంలో 'సదరన్ ట్రావెల్స్' నూతన బ్రాంచ్‌ని క్రేన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత జీవీఎస్ఎల్ కాంతారావుతో కలిసి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆదివారం ఘనంగా ప్రారంబించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ప్రవీణ్ ప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ గుంటూరు ప్రజలకు ప్రయాణ, పర్యాటక సేవలు అందించాలన్న లక్ష్యంతో ఆలపాటి కృష్ణ మోహన్ గుంటూరులో 1970లో స్థాపించబడిన సదరన్ ట్రావెల్స్ భారతదేశం అంతటా శాఖలను కలిగి ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆలపాటి కృష్ణమోహన్ గుంటూరు ప్రజలకు సదరన్ ట్రావెల్స్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ఈ కొత్త బ్రాంచ్ అత్యున్నత స్థాయి ప్రయాణ సేవలను అందించడంలోనూ, ప్రజలతో శాశ్వత సంబంధాలు నెలకొల్పుకునే విధంగా ఉండాలని ఆకాంక్షించారు.

చంద్రబాబును కలిసిన జిల్లా నాయకులు

విశాలాంధ్ర-వినుకొండ: ఏసీబీ కోర్టులో ఆదివారం చంద్రబాబును జిల్లా టీడిపి అధ్యక్షులు, మాజీ శాసనభ్యులు జీవి ఆంజనేయులు, ఉమ్మడి జిల్లా నాయకులు తదితరులు కలిశారు.

చంద్రబాబు అక్రమ అరెస్టు దుర్మార్గం

విశాలాంధ్ర-పెదకూరపాడు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపుమేరకు నియోజవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ఆదివారం నియోజవర్గ స్థాయిలో మౌన దీక్షా కార్యక్రమం పెదకూరపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేశారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అత్తిమల రమేష్ మాట్లాడుతూ సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర ఎదిగిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా అక్రమంగా అరెస్టు చేయటం దుర్మార్గ చర్యని అన్నారు. ఈనాటి వైసీపీ ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కక్ష సాధింపులో భాగంగా సీఐడీ అధికారులతో తప్పుడు కేసులు పెట్టడం బాధాకరమన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ పోరాటాలు చేస్తున్న నారా చంద్రబాబు నాయుడుపై ఇలాంటి కేసులు గతంలో ఎప్పుడు జరగలేదని ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. న్యాయ పోరాటం ఎప్పటికీ గెలుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రామ్‌గోపాల్ రావు, భాష, ఆంజనేయులు, మౌలాలి, కంచర్ల సుధాకర్, వసంత, పాటిబండ్ల బాలయ్య, గుంటుపల్లి కోటేశ్వరరావు, వడ్లమడి అప్పారావు, నందిగామ ఆశీర్వాదం, మద్దిరాల గంగాధర్, చంద్రశేఖర్, గల్లా బాబురావు, వెల్లలచెరువు సురేష్, రఘు, నరేంద్ర, షేక్ ముంతాజ్, గంగినేని లీలావతి, సరిపూడి కుమారి, పద్మ, మాజీ ఎంపీపీ పాటిబండ్ల శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్ జగన్ ప్రతీకారమే..

విశాలాంధ్ర-పెదకూరపాడు : రాష్ట్రంలో ప్రతిపక్షాలపై ప్రతికారమే లక్ష్యంగా జగన్ పరిపాలన కొనసాగిస్తుందని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మున గోటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో అన్నారు. చంద్ర బాబు అరెస్టును తీవ్రంగా ఖండించారు. పోలీసులు అర్ధరాత్రి హడావిడి చేయడం.. నంద్యాలలో చంద్రబాబు బస్సు వద్ద గందరగోళం సృష్టించడం చివరకు అరెస్టు చేయడాన్ని తప్పుపట్టారు. జగన్ సర్కార్ ప్రతిపక్షాలను వేధింపులు గురిచేస్తుందని విమర్శించారు. చంద్రబాబు నాయుడుని అరెస్టు చేసిన ఎఫ్ఐఆర్ కాపీలో 2021లో చంద్రబాబునాయుడు పేరు లేదు కానీ ఈరోజు అదే ఎఫ్ఐఆర్ కాపీలో చంద్రబాబు నాయుడు పేరు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. చంద్రబాబుపై ఆరోపణలు ఉంటే పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టవచ్చని కానీ ఆ అర్ధరాత్రి డ్రామాలు ఏమిటని ప్రశ్నించారు. జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర అభివృద్ధి పక్కనపెట్టి కక్షపూరిత రాజకీయాలు చేస్తు న్నారని విమర్శించారు. చంద్రబాబు తనయుడు లోకేష్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతలను ఎక్కడికక్కడ పోలీసులు నిర్బంధించడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. ఆర్టీసీ బస్సులను సాక్షాత్తు పోలీసులే నిలిపివేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం అన్నారు. పారిశ్రామికవేత్తలకు వైసీపీ నేతలు నుంచి బెదిరింపులు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. నిత్యం ప్రతిపక్షాలపై వేధింపులు, నిర్బంధాలు, దాడులు అక్రమ అరెస్టులు పెరిగిపోతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామిక పాలన అట్టకెక్కి పోలీసుల రాజ్యం నడుస్తుందని తెలిపారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తన పార్టీ కార్యాలయానికి రోడ్డు మార్గానే వెళ్తానన్నా కూడా పోలీసులు వెళ్ళనీయకుండా అర్ధరాత్రి సమయంలో పవన్ కళ్యాణ్‌ను అడ్డుకోవడాన్ని ఖండించారు. జగన్ ప్రభుత్వం నిరంకుశ విధానాలు అవలంబిస్తుందని తెలిపారు. ప్రజాతంత్రవాదులంతా ఇలాంటి చర్యను ముక్తకంఠంతో ఖండించాలని కోరారు.

ఉన్నవలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-యడ్లపాడు : చిలక లూరిపేట, యడ్లపాడు మండల ఉన్నవ గ్రామ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉన్నవ గ్రామంలో జనసేన పార్టీ యడ్లపాడు మండల అధ్యక్షుడు గల్లా వెంకట్రావు అధ్యక్షతన ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి తోట రాజ రమేష్ పాల్గొని మెడికల్ క్యాంపును ప్రారంభించారు. క్యాంపులో 350 మందికి పైగా ఉచితంగా కంటిలో శుక్లాలు, ఊపిరితిత్తులు, మోకాళ్ళు, గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకొని మందులు ఉచితంగా పొందారు. ఈ సందర్భంగా రాజా రమేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు చిలకలూరిపేట జనసేన పార్టీ పనిచేస్తుందని అన్నారు. పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు నిర్వహిస్తామని తెలిపారు. నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతూ వారి కష్టాలలో పాలుపంచుకుంటున్న పార్టీ జనసేన పార్టీ మాత్రమేనని స్పష్టంచేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ సుభాని, యడ్లపాడు మండల అధ్యక్షులు గల్లా వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి పాపన హనుమంతరావు, కార్యదర్శులు నాని, పోలయ్య, చిలకలూరిపేట నియోజకవర్గ నాయకులు షేక్ మునీర్ హసన్, స్టీల్ అంజి, జానీ భాష, వెంకటస్వామి, కరిముల్లా, వెంకటేష్, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కుంచనపల్లి సాంబశివరావు, ఉపాధ్యక్షులు గల్లా శివ కోటేశ్వరరావు, శంకర్, కుంచనపల్లి కుమార్ బాబు, కుంచనపల్లి సతీష్, గల్లా మణికంఠ, బొమ్మ గోపి, వీర మహిళ ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

విశాలాంధ్ర-మాచర్ల : వీరనారి చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని ఏపీ చాకలి ఐలమ్మ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మన్నెం పాండురంగారావు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ సెంటర్‌లోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాండురంగారావు మాట్లాడుతూ ఐలమ్మ చిన్ననాటి నుంచే ఉద్యమస్ఫూర్తిని కలిగి ఉండేదని, సొంత భూమి లేని చాకలి ఐలమ్మ కుల వృత్తితో పాటు, మల్లంపల్లి ముక్తాదారు ఉత్తమ రాజు కొండల రావు దగ్గర 4 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని జీవనం సాగించేవారన్నారు. తద్వారా వచ్చిన ఆదాయంతో జీవనాన్ని సాగిస్తూ, నాడు జరిగిన 11 ఆంధ్ర మహాసభలో సభ్యురాలుగా చేరి ప్రజల్లో చైతన్యాన్ని కలిగించిందన్నారు. మహాసభ జరిగిన నాటి నుంచి భూస్వాములకు వెట్టిచాకిరీ చేయడాన్ని ప్రజలు నిరాకరించారన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో నాటి భూస్వాములు పట్వారిలు, దొరలు, పటేళ్లు బలవంతంగా పన్నులు వసూలు చేయటాన్ని ఐలమ్మ నాయకత్వంలో ప్రజలు ప్రతిఘటించారన్నారు. ప్రజలను చైతన్యపరుస్తూ ఉద్యమ స్ఫూర్తితో ముందుకువెళ్ళుతున్న చాకలి ఐలమ్మ నాడు పన్నులు వసూలు చేస్తున్న 40 గ్రామాల అధిపతి విసునూరు రామచంద్రారెడ్డిపై తిరుగుబాటు చేసి ప్రజల భూమిని ప్రజలకే దక్కేలా తిరుగుబాటు చేసిందని అన్నారు. కార్యక్రమంలో షేక్ అన్వర్ భాష, బత్తిన పేరయ్య, బాలశౌరి, ముక్కా సోమయ్య, మోరా భాస్కర్ రెడ్డి, కేశం శ్రీనివాసరావు, మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్ : టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ గుంటూరు లక్ష్మీపురంలోని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోవెలమూడి రవీంద్ర (నాని)కార్యాలయం వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుఖవాసి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను టీడీపీ నాయకులు ఆదివారం రాత్రి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా డౌన్ డౌన్ సీఎం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని టీడీపీ నాయకులను పట్టాభిపురం పోలీసుస్టేషన్‌కు తరలించారు.

చంద్రబాబును బేషరతుగా విడుదల చేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు దుర్మార్గమని టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులు ముక్తాఫ్ అహ్మద్ ఖండించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆదివారం వినకొండ టిడిపి ఆధ్వర్యంలో స్థానిక శివయ్య స్తూపం సెంటర్లో ఆదివారం చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలకు ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని రాష్ట్ర ప్రజలను కాపాడేందుకు చంద్రబాబు నాయుడు ప్రజల్లో ఉండి పోరాటం చేస్తుంటే ప్రజాదరణ చూసి భయపడిన జగన్ రెడ్డి అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు, లోకేష్ చేస్తున్న పోరాటం ప్రజలందరి కోసమని మనమంతా వారికి అండగా నిలవాలని కోరారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి బేషరతుగా విడుదల చేసేంతవరకు పోరాటం కొనసాగుతుందన్నారు. బాబు వెంటే మేమంతా అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు నలబోలు రామకోటేశ్వరరావు, పొట్లూరి సైదారావు, మీసాల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పటాన్ ఆయుభ్ ఖాన్, షమీంఖాన్, సౌదాగర్ జానీ బాషా, గంగినేని ఆంజనేయులు, పెమ్మసాని నాగేశ్వరరావు, గడిపూడి విశ్వనాథం రాపర్ల జగ్గారావు, గన్నమనేని వెంకయ్య, గద్దె వీర మస్తాన్రావు, గోరంట్ల హనుమంతరావు, ముంద్రు సుబ్బారావు, దాసరి కోటేశ్వరరావు, వంకాయలపాటి పేరయ్య, మొంద్ర సుబ్బారావు, మీసాల మురళీ కృష్ణ యాదవ్, గంగినేని బాబు,వాసిరెడ్డి లింగమూర్తి,రోడ్ద వీరాంజనేయరెడ్డి,బొట్ల అంజయ్య, సోమేపల్లి బ్రహ్మయ్య, మక్కెన కొండలు మద్దుకూరి రాంబ్రహ్మం, ముత్తినేని ఏడుకొండలు, బత్తుల గోవిందరాజులు, సిద్ధారపు ఫరీద్, కానాల వెంకటేశ్వర రెడ్డి, గంధం సుబ్బారావు, నర్రా కిషోర్, మన్యం ఆదిలక్ష్మి, చౌడమ్మ బొట్లగుంట లక్ష్మి, తూమాటి కాశి, గోల్డ్ కరిముల్లా, అనీలు, షబ్బీర్ పాల్గొన్నారు.

ఓటరు పరిశీలన పారదర్శకంగా జరగాలి

విశాలాంధ్ర-శావల్యాపురం : ఓటరు పరిశీలన ఎన్నికల కమీషన్ నిబంధల మేరకు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, బీఎల్వోలు ఏ రాజకీయ పార్టీల ప్రలోభాలకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వినుకొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కందుల శ్రీరాములు అన్నారు. మండలంలోని కారుమంచి, గుంటుపాలెం, శానంపూడి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. 2019లో శాసనసభ ఎన్నికలు నిర్వహించిన పోలింగ్ కేంద్రాలన్ని సక్రమంగానే ఉన్నాయా, పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గుంటుపాలెం ప్రాథమిక పాఠశాల భవనంలో గతంలో పోలింగ్ కేంద్రాన్ని నిర్వహించగా ఇప్పుడు పాఠశాల మూతబడినందున పోలింగ్ కేంద్రాన్ని అక్కడి నుంచి మార్చి గ్రామసచివాలయంలో ఏర్పాటు చేయాలని వైసీపీ వర్గీయులు ఈఆర్వోని కోరగా, పాఠశాల మూతపడినా భవనం అంతా బాగానే ఉంది కాబట్టి పోలింగ్ కేంద్రాన్ని అక్కడే కొనసాగించాలని టీడీపీ వర్గీయులు ఈఆర్వోను కోరారు. విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్ళి వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకొంటామని ఈఆర్వో తెలిపారు. ఈఆర్వో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు నిర్వహించే ప్రభుత్వ పాఠశాలలలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కల్పించినందున వసతులన్నీ బాగానే ఉన్నాయన్నారు. తహశీల్దార్ షేక్ జాన్‌సైదులు, డిప్యూటీ తహశీల్దార్ నాసరయ్య, పంచాయతీ కార్యదర్శులు చింతా శ్రీనివాసరావు, ముంద్రు మనోహర్, వెల్ఫేర్ అసిస్టెంట్లు శిరీష్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఇది చీకటి రోజు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్ : తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించటం ప్రజాస్వామ్యానికి చీకటి రోజని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర అన్నారు. ఆదివారం విజయవాడ కోర్టులో వాదనల అనంతరం అధినేత చంద్రబాబు నాయుడును కలిసిన ఆయన మాట్లాడుతూ రాజకీయ కుట్రలో భాగంగా చంద్రబాబును అరెస్ట్ చేసి జగన్ అండ్ కో పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారని కోవెలమూడి రవీంద్ర విమర్శించారు. చంద్రబాబు అరెస్ట్‌తో వైసీపీకి కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. ఒక విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబుకు మంచి గుర్తింపు ఉందని ఓర్వలేకే ఆయన పేరు ప్రతిష్టలకు భంగం కల్పించాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ నాయకులు ఆయన ప్రతిష్ఠతకు మసిపూయాలన్న ఆలోచనతో అక్రమ అరెస్టుకు సిద్ధపడ్డారని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి జరిగిందన్నది వైసీపీ అబద్ధపు ప్రచారం మాత్రమేనని కోవెలముడి తెలిపారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపినిస్తున్నామని, ప్రజలు ఈ బంద్‌కు సహకరించాలని కోరారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర-సత్తెనపల్లి : స్టాఫ్ నర్స్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఆదివారం స్థానిక వేద కళాశాలలో పట్టాలు అందించారు. ఈ సంద ర్భంగా ప్రభుత్వ వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ మాట్లా డుతూ నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్ర మైనదని పేర్కొన్నారు. సమాజంలో పేదలకు సేవ చేసే అదృష్టం నర్సింగ్ వృత్తిలో ఉంటుందన్నారు. సత్తెనపల్లి ప్రాంత విద్యార్థులకు అందుబాటులో నర్సింగ్ పారా మెడికల్ కోర్సులు తీసుకువచ్చిన వేద విద్యాసంస్థలను ఆమె అభినందించారు. వైద్యశాల హెడ్ నర్స్ బంగారు పాప మాట్లాడుతూ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విదేశాలలో బాగా డిమాండ్ ఉన్న కోర్స్ నర్సింగ్ అన్నారు. ఇంటర్ వొకేషనల్ నర్సింగ్ ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు నర్సింగ్ క్యాప్‌లు అందించి ప్రమాణం చేయించారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో శిక్షణకు వస్తున్న విద్యార్థుల వలన పేద రోగులకు మరింత సేవలు అందుతున్నాయని అన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ తమ కళాశాల నుంచి కేవలం గత రెండు సంవత్సరాల కాలంలో మూడు వందల మందికిపైగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని చెప్పారు. అనంతరం నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల బాధ్యులు ఇ.సరిత, కె.ప్రభావతి, ఐ.నాగలక్ష్మి, సైదా నాయక్, నాగరాజు, రవికుమార్, అడ్మిన్ డైరెక్టర్ చింతాడ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలతో కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర - నకరికల్లు : కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం మండల కేంద్రమైన నకరికల్లులోని తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఇంటింటికి ఎలక్టోరల్ రోల్స్, రీ వెరిఫికేషన్, డెత్ ఓటర్ రీ వెరిఫికేషన్, 100 ఏజ్ ఓటర్ వెరిఫికేషన్, జీరో డోర్ నెంబర్ ఓటర్ల వెరిఫికేషన్, డబల్ ఎంట్రీ ఓటర్లు, పెండింగ్ క్లెయిములు తదితర అంశాలపై తనిఖీ చేశారు. ఇసిఐ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియను ఖచ్చితంగా, వెంటనే పూర్తి చేయాలని ఏఈఆర్ఓ, బిఎల్ఓలను ఆదేశించారు. బూత్‌లెవల్ అధికారులు, ఏఈఆర్ఓలు, ప్రత్యేక అధికారులు, ఈఆర్వోలు తొలగించిన ఓటర్ల లిస్టును రీ వెరిఫై చేసే క్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గంలోని నకరికల్లులో క్షేత్రస్థాయిలో స్వయంగా సంబంధిత ప్రజలను కలిసి వివరాలను సేకరించారు. అనంతరం మండల రెవిన్యూ అధికారి కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలక్టోరల్ రోలులో ఓట్లు తొలగింపులపై వివరంగా విసిదీకరించారు. అలాగే ఫామ్-7 పై బూత్ లెవల్ అధికారులు, ఏఈఆర్వోలు నిర్వహించిన ఎంక్వైయిరీ రిపోర్టును నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో మండల రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో టీడీపీ శ్రేణుల నిరసన

విశాలాంధ్ర-అమరావతి : టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయటాన్ని ఖండిస్తూ మండల కేంద్రమైన అమరావతిలోని సత్తనపల్లి క్రాస్ రోడ్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అమరావతి మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు రైతు సంఘం రాష్ట్ర నాయ కులు కన్నధార వసంతరావు మాట్లాడుతూ నిజాయితీని బద్దతగల మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబును అక్రమ అరెస్టు చేయటాన్ని సభ్య సమాజం ముక్తకంఠంతో ఖండిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటాన్ని దుయ్యబట్టారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకునే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మల్లాది విష్ణు, ఏరియా నాయకులు చిరుమామిళ్ల బాలశౌరి, ఎస్‌కే జానీ, షేక్ భక్షు, జిల్లా నాయకులు భవిరిశెట్టి వెంకటేశ్వర్లు, దండా శివయ్య, కోటేశ్వరరావు, దానేలు తదితరులు పాల్గొన్నారు. సుమారు మూడు గంటల పాటు నడిరోడ్డుపై దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలను చోటు చేసుకోకుండా అమరావతి సీఐ ఎ.బ్రహ్మం ఆధ్వర్యంలో పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

నూతన ఫించన్ లబ్ధిదారుల్లో ఆందోళన

విశాలాంధ్ర-శావల్యాపురం : మండలంలోని 11 గ్రామసచివాలయాల పరిధిలో నూతనంగా ఫించన్లకు దరఖాస్తు చేసుకొన్న లబ్దిదారులలో తీవ్ర ఆందోళన నెలకొంది. మండలంలో మొత్తం 411 మంది లబ్దిదారులు ఫించన్ల కోసం దరఖాస్తు చేసుకోగా వారిలో మొదటి విడతగా 156 మందికి ప్రభుత్వం ఫించన్లు మంజూరు చేసి వారందరికీ ఫించన్లను పంపిణీ చేసింది. రెండవ విడతగా 237 మందికి ఫించన్లు మంజూరయ్యాయని, వారికి కూడా ఈ నెల 7వ తేదీలోపు పంపిణీ చేస్తామని అధికారులు వెల్లడించారు. కానీ ఫించన్ల పంపిణీకి 10వ తేదీ వరకు గడువు పొడగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ప్రభుత్వం ప్రకటించిన 10వ తేదీన కూడా లబ్దిదారులకు ఫించన్లు పంపిణీ చేయకపోగా ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడం, లబ్దిదారుల జాబితాలు కూడా విడుదల చేయకపోవడంతో లబ్దిదారులలో తీవ్ర ఆందోళన నెలకొంది. దీనిపై ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను వివరణ కోరగా వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్లోకి లబ్దిదారుల జాబితాలు ఇంకా రాలేదని, ప్రభుత్వం నుంచి తమకు సమాచారం అందగానే తెలియజేస్తామన్నారు.

సనాతన ధర్మాన్ని నిర్మూలించినప్పుడే సమాజం అన్ని రంగాల్లో ముందుకు..

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సనాతన ధర్మాన్ని నిర్మూలించినప్పుడే సమాజం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందన్న తమిళనాడు మంత్రి ఉదయ్ నిధి స్టాలిన్ అన్న మాటలను దళిత బహుజన ప్రజా సంఘాలు సమర్థిస్తున్నాయని ఇండియన్ లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మొద్దు అంకయ్య అన్నారు. ఆదివారం స్థానిక లాడ్జి సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సామాజిక న్యాయం ముద్దు-సనాతన ధర్మం వద్దు అంటూ దళిత బహుజన ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంకయ్య మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా, అసమానతలు తగ్గేలా స్వేచ్ఛా ప్రజాస్వామ్యం బలపడేలా దేశాన్ని నడిపించటం ప్రభుత్వ ధర్మం అని అన్నారు. అనంతరం పాగళ్ళ ప్రకాష్ మాట్లాడుతూ తరతరాలుగా ఈ భారతదేశంలో సనాతన ధర్మం అనే ముసుగులో మనువాదాన్ని కొనసాగిస్తున్నారని, ఈ సనాతన ధర్మం రెండు, మూడు వర్గాల వారిని పైస్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తుందని ఆరోపించారు. 85శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల మహిళలను అనేక రూపాల్లో వేధింపులకు గురి చేసిన మను ధర్మాన్ని...దానిని బలపరుస్తున్న సనాతన ధర్మాన్ని శాశ్వతంగా నిర్మూలించాలన్నారు. ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఖాజావలి మాట్లాడుతూ ఉదయ్ నిధి స్టాలిన్ మాట్లాడిన వ్యాఖ్యలను దళిత బహుజన సంఘాలుగా సమర్థిస్తున్నట్లు చెప్పారు. ఉదయ్ నిధి స్టాలిన్ తలకు రూ.10కోట్లు సుపారి ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని, ఆ మాటలు అన్న స్వామీజీని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కారక్రమంలో గంగోలు శామ్యూల్, నల్లపు నీలాంబరం, చిలక సాంబయ్య, ఆదినారాయణ, జల్ది మోహన్, రాజేంద్ర ప్రసాద్, సుజాతారావు, షేక్.బాజీ, కమలకుమారి, రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బియ్యం పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి కార్యాలయంలో అధ్యక్షులు మామిడి మురళీకృష్ణ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత బియ్యం పంపిణీ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా మామిడి లీల, పి.కేదారేశ్వరి విచ్చేశారు. వారు మాట్లాడుతూ ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కార్యదర్శి మాదాల ప్రకాష్, ఎస్‌వీ రమణ, పలకలూరి శివరావు, పల్లంపాటి రజనీశ్వరరావు, మామిడి ప్రతీక్, శ్రావణ్, టి.మురళీసాయి తదితరులు పాల్గొన్నారు.

కనకయ్య సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర- పర్చూరు: కామ్రేడ్ కృష్ణంశెట్టి కనకయ్య సేవలు చిరస్మరణీయ మని పలువురు వక్తు లు కొనియాడారు. స్థానిక ప్రభుత్వ జూని యర్ కళాశాలలో ఆదివారం 8వ సంస్మరణ సభ జరిగింది. కనకయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన సభలో వక్తలు మాట్లా డుతూ కనకయ్య గ్రామాభివృద్ధికి చేసిన సేవలను, విద్యాభివృద్ధికి, బాలికల విద్యను ప్రోత్సహించుటకు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో కోటా హరిప్రసాద్, కారుమూరి సీతారామయ్య, కృష్ణంశెట్ట రామకోటేశ్వరరావు, పాబోలు ఉదయభాస్కర్, కృష్ణంశెట్టి పార్వతి, అజయ్‌బాబు, కొల్లా వెంకటేశ్వర్లు, చింపారెడ్డి, షేక్ మహ్మద్‌బాషా, కోటా శ్రీనివాసరావు, చింతగుంట శ్రీనివాసరావు, రమేష్, ఉప్పుటూరి మురళీకృష్ణ ఉన్నారు.

ఆలయ స్లాబు పనులకు భూమిపూజ

విశాలాంధ్ర-అద్దంకి; పట్టణం లోని కాకానిపాలెంలో రూ. 3 కోట్ల 60లక్షల టీడీడీ నిధులతో పునర్‌నిర్మాణం జరుగుతున్న పురాతన శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ స్లాబు పనులకు ఆదివారం టీటీడీ మాజీ చైర్మన్ వైవీసుబ్బారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి భూమిపూజ నిర్వహించారు. ఈ పురాతన దేవాయాన్ని టీటీడీ నిధులతో పూర్తిగా రాతికట్టడంతో నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, దేవాలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ కాకాని రాధాకృష్ణమూర్తి, కార్యనిర్వహణాధికారి ఎస్.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌పై నిరసన

విశాలాంధ్ర-అద్దంకి ; తెలుగుదేశంపార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా పట్టణ తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు చేతబట్టుకొని సామూహిక నిరసన కార్యక్రమం చేపట్టారు.

టీడీపీ, జనసేన నాయకుల అరెస్ట్

విశాలాంధ్ర - యద్దనపూడి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్ సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా యద్దనపూడి మండల టిడిపి, జనసేన నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. టిడిపి మండల అధ్యక్షుడు నల్లపునేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వర రావు, కోయ సతీష్,జనసేన మండల అధ్యక్షులు గనిపిశెట్టి అయ్యప్పను అరెస్ట్ చేశారు. సందర్భంగా రంగయ్య చౌదరి మాట్లాడుతూ చంద్రబాబును ఎటువంటి ఆధారాలు లేకుండా అప్రజాస్వామ్యంగా అరెస్టు చేశారన్నారు.

టీడీపీ శ్రేణుల నిరసన దీక్షలు

విశాలాంధ్ర - వేమూరు : మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత చంద్రబాబు నాయు డు అక్రమ అరెస్టుకు నిరస నగా తెలుగుదేశం పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఆది వారం పార్టీ శ్రేణులు స్థానిక ఎన్టీఆర్ పురవేదిక వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. నియోజకవర్గ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు ఎన్టీఆర్ పురవేదిక వద్దకు చేరుకుని దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు జొన్నగడ్డ విజయ్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలను వేధింపులకు గురి చేస్తుం దన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే మమ్మనేని వెంకటసుబ్బయ్య, మురళీకృష్ణ, వీఎస్‌కే ప్రసాద్, వాక శేషుబాబు, శరణగిరి రాజేంద్రప్రసాద్, అమ్మిశెట్టి కిషోర్, షేక్ అనీఫ్, బోడపాటి బసవేశ్వర రావు, శివకృష్ణ, బండారు సూర్యనారాయణ,వెంకటరెడ్డి, పుణ్య శ్రీనివాసరావు, ఎలమంచిలి బుజ్జి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్‌గా వెంకటకృష్ణ

విశాలాంధ్ర - నిజాంపట్నం : బీసీ సంక్షేమ సంఘం రేపల్లె నియో జకవర్గం కన్వీనర్‌గా నగరం మండలానికి చెందిన ప్రముఖ న్యాయవాది మోర్ల వెంకటకృష్ణను నియమించినట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. ఆదివారం నిజాంపట్నం మండలంలోని బొర్రావారిపాలెంలో మోర్ల వెంకటకృష్ణకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నాగబాబు, బడుగు వెంకట నారాయణ, ఎం.శివయ్య, కేశన చైతన్య, యేమినేని వెంకటేశ్వరరావు, కేసన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది

విశాలాంధ్ర-నందిగామ: టీడీపీ జాతీయ నాయకులు నారా చంద్రబా బునాయుడు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలి పారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు రెండో రోజు చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ సామూహిక నిరాహార దీక్ష స్థానిక పార్టీ కార్యాలయంలోనే ఆదివారం దేశం శ్రేణులతో ప్లేకార్డులతో నల్లబ్యాడ్జీలు ధరించి దీక్ష చేపట్టారు.

చంద్రబాబుపై సీఎం జగన్ ప్రతీకారం

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుపై ప్రతీకారమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి కక్ష సాధింపునకు పాల్పడ్డాడని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మండిప డ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్ల రాజ కీయ అనుభవం 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తిని అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయటం దారుణం అన్నారు. రాష్ట్రంలో రోజురోజుకు వైసిపి ప్రభుత్వం అన్యా యాలను అక్రమాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలను వేధింపు లకు గురిచేస్తోందని విమర్శించారు. చంద్రబాబుకు పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టవచ్చని కానీ ఆ అర్ధరాత్రి గందరగోళం సృష్టించి భయానక పరిస్థితులు తలెత్తే విధంగా వ్యవహరించటం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో పెట్టుబడులు ఆర్థిక వనరుల పెంపు పక్కనపెట్టి సీఎం జగన్ కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నేడు రాష్ట్రంలో జరుగుతున్న అరాచకపాలన ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామికవేత్తలకు, వ్యాపారవేత్తలకు వైసీపీ నేతల నుంచి బెదిరింపులు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. నిత్యం ప్రతిపక్షాలపై వేధింపులు, నిర్బంధాలు, దాడులు, అక్రమ అరెస్టులు పెరిగిపోతున్నాయన్నారు. ఏపీలో ప్రజాస్వామిక పాలన అటకెక్కి పోలీస్ రాజ్యం నడుస్తోందని, జగన్ ప్రభుత్వం నిరంకుశ విధానాలు అవలంబిస్తున్నదని చెప్పారు. చంద్రబాబు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని సింగరకొండ తెలిపారు.

చంద్రబాబు అవినీతిపై ఆధారాలతో కేసు నమోదు : ఎంపీ

విశాలాంధ్ర - రేపల్లె : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అవినీతి,అక్రమాలపై పూర్తి ఆధారాలతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు ఫైనాన్స్ డిపార్ట్మెంట్ అభ్యం తరాలను పక్కకు నెట్టి క్యాబినెట్ నిర్ణయాలతో సంభంధం లేకుండా సీమెన్స్ సంస్థను తెరపైకి తీసుకువచ్చి భారీ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. సుమారు రూ.370 కోట్ల రూపాయల నిధులు బినామీ పేర్లతో తనయుడు లోకేష్ ఖాతాలోకి మరల్చారనే స్పష్టమైన ఆధారాలతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారని చెప్పారు. పవన్ కళ్యాణ్, పురందేశ్వరి, బాలకృష్ణ, భువనేశ్వరి ప్రత్యేక విమానాలలో గన్న వరంలో దిగటానికి వారికి డబ్బులు ఎక్కడ నుండి సమ కూరాయని ప్రశ్నించారు. చేసిన అవినీతి నుండి బయటపడేందుకు ఢిల్లీ నుండి అతి ఖరీదైన అడ్వకేట్లను పిలిపించటం ఎందుకని ప్రశ్నిం చారు. విచారణ సంస్థలను నిజాయితీగా ఎదుర్కొనే దమ్ము ధైర్యం చంద్రబాబు నాయుడుకులేదన్నారు. ఆనాడు జగన్ ఏం అవినీతి చేశారని అరెస్టు చేశారో చెప్పాలన్నారు. ఆనాడు జగన్‌కు వస్తున్న ప్రజాభిమానాన్ని చూడలేక ఆధారాలు లేకపోయినా అరెస్టు చేశారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు సోనియా, చిదంబరం కాళ్లు పట్టుకొని సిబిఐ ప్రోత్సాహంతో ఆనాడు జగన్ మోహన్ రెడ్డిని అరెస్టు చేయించారని చెప్పారు. ప్రస్తుతం ఆధారాలతో చంద్రబాబు నాయుడు అడ్డంగా బుక్కయ్యారని తెలిపారు. విచారణ అధికారులు ఏమి అడిగినా చంద్రబాబు నాకు ఏమాత్రం గుర్తులేదని చెప్పటం చట్టాన్ని తప్పుదారి పట్టించడమే అన్నారు. రాజధాని నిర్మాణంలోనూ టిడ్కో ఇళ్ళనిర్మాణంలోను షాపుజీ పల్లంజీ ఎల్ అండ్ టి కంపెనీలలో రూ. 118 కోట్ల అవినీతి జరిగిందన్నారు. చంద్రబాబుకు సానుభూతి తెలపడానికి వచ్చిన పెద్దలు వాస్తవాలను గమనించాలని హితువు పలికారు. చంద్రబాబు నాయుడు అరెస్టుపై సానుభూతి తెలపటం ఆర్థిక నేరస్తులను ప్రోత్సహించటమేనన్నారు.

పోలీసునంటూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : పోలీస్ అని చెప్పి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని చందోలు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఖాజీపాలెం గ్రామంలోని రామ్ నగర్‌లో నివాసం ఉండే పెనుమత్స నాగవర్మ ఈ నెల 6న ఉదయం 8 గంటల సమయంలో వారి కోళ్ల ఫారం వద్ద ఉండగా ఎవరో ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పోలీస్ అని చెప్పి బెదిరించి రూ.5 వేలు తీసుకొని వెళ్ళిపోయాడని బాధితుడు పెనుమత్స నాగవర్మ చందోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. అతడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా ప్రత్యక్ష సాక్షులు, ఫిర్యాదుదారుడు చెప్పిన వివరాల ఆధారంగా ఈ నెల 9న శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఖాజీపాలెం పెట్రోల్ బంక్ సమీపంలో నిందితుడు నక్కల శ్రీకాంత్‌ను మధ్యవర్తుల సమక్షంలో విచారించి అరెస్టు చేశామని తెలిపారు. నిందితుడు నక్కల శ్రీకాంత్ గతంలో కూడా ఇదేతరహా నేరాలకు పాల్పడినట్లు నిర్ధారించడం జరిగిం దన్నారు. నక్కల శ్రీకాంత్ ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతూ చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నేను పోలీస్‌నని ఎదుటి వారిని భయపెట్టి, బెదిరించి, దౌర్జన్యానికి పాల్పడి వారి నుండి డబ్బులు ఇతర విలువైన వస్తువులు తీసుకొని జల్సా చేస్తూ ఉండేవాడని, గతంలో కర్లపాలెం, బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇదే తరహాలో నేరాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-రేపల్లె : తెలుగు దేశంపార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా పార్టీ శ్రేణులు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె రామాంజనేయులు ఆధ్వర్యంలో దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు జీ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. సంఘం డైరీ డైరెక్టర్ నర్రా వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అధికార పార్టీ రాచరిక విధానాలను అనుసరిస్తుంది విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలకు తిలోదాకాలిస్తు ప్రతిపక్ష నాయకుడిని నిబంధనలకు విరుద్ధంగా అరెస్టు చెయ్యటం దుర్మార్గపు చర్య అన్నారు. దీక్షలో కె.రాము, మేక శివరామకృష్ణ, పంతాని మురళి ధర రావు, కె.వెంకటేశ్వరరావు, అనగాని శివప్రసాద్,చింతారావు,యాలవర్తి లక్ష్మీ,గౌరీ రామకుమారి, సుబ్రహ్మణ్యం, టీడీపీ లీగల్ సెల్ నాయకులు ధర్మతేజ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నాయకుల అరెస్ట్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా నియోజకవర్గంలో టిడిపి నాయకులు, జనసేన నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ తరలించారు.జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి నామన శివన్నారాయణ, కర్లపాలెం మండలం జనసేన అధ్యక్షులు గొట్టిముక్కల శ్రీకృష్ణ, టీడీపీ మాజీ ఎంపీటీసీ బాజీ, అడె వంశీ, షాలెం, నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు,తానికొండ దయబాబు దొప్పలపూడి రాజశేఖర్‌లను అరెస్టు చేశారు.ఈ సందర్భంగా జనసేన నాయకులు శివన్నారాయణ మాట్లాడుతూ జనసేన అదినేత పవన్ కళ్యాణ్‌ను ఆంధ్ర బోర్డర్లో ఆపి తన కార్యాలయానికి రానీయకుండా శాంతి భద్రతల సమస్య నెపంతో అనేక ఇబ్బందులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

తిరుమలకు 10 టన్నుల కూరగాయలు

విశాలాంధ్ర - మార్టూరు : కలియుగ వైకుంఠం పవిత్ర తిరుమలలో ఏడుకొండల సన్నిధిలో చేసే దానం కోటి జన్మల పుణ్యఫలమని ముఖ్యంగా అన్నదానం అత్యంత శ్రేష్టమైనదని వేద పండితులు ఐ.సీతారామాచార్యులు అన్నారు.తిరుమలలో ప్రతిరోజు లక్ష మందికి పైగా భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం జరుగుతుంది.ఈ అన్నదానంలో బాగంగా భక్తులు గతంలో పది టన్నులతో స్వామివారి వాహనంలో కూరగాయలు పంపించారు. ఆదివారం మరోసారి పది టన్నుల కూరగాయలతో మరో వాహనం తిరుమలకు సిద్ధం చేసారు.మార్టూరు పెదకాన వద్ద వేద పండితులు ఐ.సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామికి వాహనం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మహిళా భక్తులు నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులను,గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నది.అనంతరం స్వామివారి కూరగాయల వాహనానికి జెండా ఊపి ప్రారంభించి భక్తులకు వెంకటేశ్వరుని లడ్డు ప్రసాదం,పులిహోర,తీర్థం అందజేశారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి భక్త సంఘం మార్టూరు,వెంకటేశ్వర భక్త సమాజం విజయవాడ,భారీ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్వనాథ సత్యనారాయణ జయంతి

విశాలాంధ్ర-గంపలగూడెం : పెనుగొలనులో ఆదివారం షిరిడి సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి విశ్వనాథ సత్యనారాయణ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 25 పైగా కావ్యాలు, 6 శతకాలు,13 గేయ కావ్యాలు, 15 నాటకాలు, 58 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శన గ్రంథాలు, మరెన్నో వ్యాసాలు, ఉపన్యాసాలు, వందల్లో రచనలు చేసి, విశ్వనాథ కవి సామ్రాట్, కళా ప్రపూర్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ, పద్మభూషణ్ మొదలైన పురస్కారాలు పొందారని సాయిబాబా సేవా కమిటీ సభ్యులు తెలిపారు.

కొనసాగిన నిర్బంధ కాండ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును స్కిల్ డెవలప్మెంట్ కేసులో సిఐడి పోలీసులు నంద్యాలలో అరెస్టు చేసి విజయవాడ తరలించి కోర్టులో హాజరు పరచిన నేపథ్యంలో చీరాల నియోజకవర్గంలో తెలుగుదేశం శ్రేణులపై పోలీసుల నిర్బంధ కాండ రెండవ రోజూ కొనసాగింది. తెలుగుదేశం పార్టీ స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ధర్నాకు, నిరాహార దీక్షలకు సిద్ధంకాగా పోలీసులు నాయకులను అరెస్టు చేశారు. నియోజకవర్గ తెదేపా ఇంఛార్జి ఎంఎం కొండయ్యను ఉదయం 6 గంటలకే కొత్తపేటలోని ఆయన నివాసంలో నిర్బంధంలోకి తీసుకుని చీరాల ఒకటవ పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. నాయకులను, కార్యకర్తలను, మహిళలను నిర్బంధించారు. సాయంత్రం తెదేపా కార్యకర్తలు అధిక సంఖ్యలో స్టేషన్ వద్దకు చేరుకోగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని అక్కడనుండి పంపివేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ న్యాయమే గెలుస్తుందని,అక్రమ కేసులు నిలవవని, ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలు ప్రజలు గమనిస్తున్నారన్నారు.

దొరలను ఎదురించిన ధీర మహిళ ఐలమ్మ

విశాలాంధ్ర - బాపట్ల : వంగిదండాలు పెట్టే రోజుల్లో సివంగిలా చిట్యాల ఐలమ్మ గర్జించిందని రజక సంఘాల ఐక్యవేదిక జిల్లానేత, న్యాయవాది అంగలకుదురు నటరాజన్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీనివాసరావు కాలనీలో చిట్యాల ఐలమ్మ వర్ధంతిని ఆ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలువురు నేతలు ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె కొంగు నడుముకు చుడితే దొరతనం తోకముడిచిందన్నారు.ఆమె కొడవలి చేతబడితే పీడితజనం కదలిలా తరలివచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఉప్పలదిన్నే గోపినాథ్ మాట్లాడుతూ ఆడదానిని అలుసుగా చూసిన వారి కంట్లో నలుసుగా మారిందన్నారు.ఆమె తెగింపుతోనే వెట్టిచాకిరీ ముగింపునకు వచ్చిందన్నారు.ఆమెను నేటి తరం ఆదర్శంగా తీసుకుని ధైర్యంగా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పులిగడ్డ శ్యాంప్రసాద్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, వెంకట నాని, శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమాజ్‌వాది పార్టీ గెలుపుపై సంబరాలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఉత్తరప్రదేశ్‌లోని ఘోసి నియోజకవర్గంలో సమాజ్‌వాది పార్టీ సుధాకర్ సింగ్ 42,759 ఓట్లు మెజార్టీతో బిజెపి అభ్యర్థి ధారాసింగ్ చౌహాన్‌పై గెలుపొందారు. ఈ నేపథ్యంలో స్థానిక సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో బాపట్ల ఏరియా హాస్పిటల్‌లోని పేషెంట్లకు బ్రెడ్,పండ్లు పంపిణీ చేశామని కార్యనిర్వాహకులు గొర్ల శ్రీనివాసరావు తెలిపారు.రాబోయే లోక్ సభ,అసెంబ్లీ ఎన్నికలలో సమాజ్ వాదిపార్టీ ప్రభంజనాన్ని సూచిస్తుంది అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె ఆశయాలు త్యాగాలు గుర్తుచేసుకుని,మనమందరం ఆమె ఆశయాల సాధనకు పునరింకితమవుతు బహుజనుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రభుత్వ టీచర్ బహుజన నాయకుడు రత్నరాజు, సీనియర్ బీసీ నాయకుడు ఎనుముల భాస్కర్ గౌడ్,అంజుమన్ కమిటీ బాపట్ల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కరీం,కమిటీ సభ్యులు అబ్దుల్ రఫీ అబ్దుల్ గ ఫూర్,అబ్దుల్ ఖాదర్ బాషా,మౌలాలి, కరిముల్లా, బీసీ సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా గౌరవ అధ్యక్షులు మద్దిబోయిన తాతయ్య ,బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నక్కల రాంబాబు,బీసీ నాయకులు తోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిన్వేస్కో కాపిటల్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-గుడివాడ : నా ఆత్మీయులచే నడపబడుతున్న ఫిన్వేస్కో కాపిటల్ ఇండియాలో తన కార్యాలయలను విస్తరించి ప్రజలకు సేవా చేస్తున్న దేశవ్యాప్తంగా మన్నలు పొందలని సినీహీరో విరాజ్ అశ్విన్ అన్నారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని పేరుమళ్ళ కేశవరావు అసుపత్రి ఎదురుగా ఫిన్వేస్కో కాపిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్‌బిఎఫ్‌సి) నూతన కార్యాలయాన్ని సినీహీరో విరాజ్ అశ్విన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో డైరెక్టర్లు లింగమనేని రత్నాకర్, కెవిటి రమేష్ మేనేజింగ్ డైరెక్టర్ జక్కంపూడి రవీంద్ర, రాకేష్‌లతో కలసి సినీహీరో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ నిభందనల ప్రకారం వ్యాపారుస్తులకు, ఆర్థిక సేవలను అందిచడం తమ లక్ష్యమన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న వెంకటేష్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల నియోజకవర్గ వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మునిసి పాలిటీ పరిధిలోని పాపరాజు తోటలో కృష్ణ గోశాల గోమాతల సీమంతపు వేడుకలు కార్యక్రమంలో పాల్గొని గోమాతలకు ప్రత్యేక పూజలు చేశారు. చీరాల మునిసిపాలిటీ పరిధిలోని స్వర్ణ రోడ్డులో లయన్స్‌క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవం, గర్భిణీలకు సీమంతం కార్యక్రమానికి హాజరయ్యారు. ముంతావారి సెంటర్ ఆర్య వైశ్య కల్యాణ మండపంలో డా.చుండూరు నాగేశ్వరరావు,లలిత దంపతులు,జిల్లా అంధత్వ నివారణ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగాకంటి వైద్య శిబిరంలో పాల్గొన్నారు.పట్టణ పరిధిలోని పాపారాజుతోట పదహారవ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోపాల్గొని ప్రతి ఇంటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి పథకాలపై అవగా హన కల్పించారు. కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాస రావు, కౌన్సిలర్లు, లయన్స్ క్లబ్ సభ్యులు, గోశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చేనేతలు స్వతంత్రంగా నాయకులవ్వాలి

విశాలాంధ్ర - చీరాల : చేనేత సమ స్యలపై పోరాడా లంటే చేనేతలు నాయకులైతేనే సాధ్య మవుతుందని, రాష్ట్ర ప్రభుత్వంలో చేనే తలు నాయకులుగా ఉన్న పార్టీ ఆదేశాలు దాటి చేనేత సమస్యల గురించి మాట్లాడలేరని జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున అన్నారు.ఆదివారం ఇపురుపాలెంలోని గీతాంజలి స్కూల్ ఆవరణలో జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శీలం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం నాయకులు మాట్లాడుతూ అన్ని కులాలు మతాలను కలుపుకొని రాజకీయ శక్తిగా ఎదిగేందుకు కృషిచేద్దామని అందుకు అనుగుణంగా జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీని స్థాపించామని రాబోయే ఎన్నికలలో ఈ పార్టీ నుంచి పోటీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నీలూరిరుషింగప్ప, దక్షిణ భారతదేశ ఇంచార్జ్ గోరిగా కొండప్ప, ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం రామచంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత నాగేశ్వరరావు,వర్కింగ్ ప్రెసిడెంటు మోదం నాగరాజు, బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు గుద్దంటి ఆదిలక్ష్మి,జిల్లాల అధ్యక్షులు నియోజకవర్గాల అధ్యక్షులు చేనేత నాయకులు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

దాతల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రోటరీక్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా దేశాయిపేట, నీలకంఠపురంలోని అనాధ వృద్ధాశ్రమంలో చీరాల కృష్ణమూర్తి ఆర్థిక సహాకారంతో వృద్ధులకు అన్నదానం చేసి, అనంతరం దుప్పట్లు పంపిణీ చేశారు. సీనియర్ రోటరీ క్లబ్ సభ్యులు బండారుపల్లి హేమంత్‌కుమార్ శాశ్వత అన్నదానానికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్ కుమార్, డి.వి.సురేష్, జి.వై.ప్రసాద్, యం.వి.సుబ్బారావు, చిలుకోటి శ్రీను, పి. శివాంజనేయప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు సత్రం మల్లేశ్వరరావు, గుత్తి విశ్వేశ్వర రావు,వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో : ఎన్.ఆర్.అండ్.పీ.ఎం హైస్కూల్, చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా విజయవాడ రెయిన్ బో హాస్పిటల్‌లో కిడ్నీ,లివర్, మెదడు వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న 16 నెలల హనీష్ చికిత్స నిమిత్తం బాలుని తండ్రి కంకణంపాటి నరేంద్రకు వైద్యఖర్చుల నిమిత్తం వాకింగ్ సభ్యులు రూ.30,200 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ,వలివేటి మురళీకృష్ణ, దేగల తిరుపతిరావు,చింతా రమేష్,శీరాం రమేష్,సుభాషిణి,చారుగుళ్ళ ప్రసాద్, వెంకటస్వామి, మామిడాల శ్రీనివాసరావు, భాస్కర్, నారాయణరావు, నారాయణమూర్తి, వాకింగ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్‌లో హాస్పిటల్‌లో చేరిస్తే ప్రాణాపాయం తప్పుతుంది

విశాలాంధ్ర - చీరాల : రోడ్డు ప్రమాదం సంభవించి నప్పుడు గాయపడిన వారిని గోల్డెన్ అవర్‌లో హాస్పటల్‌కు తరలిస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చని ప్రస్తుత జీవన విధానంలో ప్రజలు ఏదైనా రోడ్డు ప్రమాదం చూసినా పట్టించుకోనట్టు వెళ్ళిపోతున్నారని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఆదివారం సాయంత్రం చీరాలలోని పేరాల, వాడరేవు రోడ్డులో ఆటోమోటార్ బైక్ ఢీకొన్న క్షతగాత్రులను చీరాల టూ టౌన్ సిఐ జి.సోమశేఖర్ హుటాహుటిన హాస్పటల్‌కు తరలించారు. ఈ ఘటనలపై ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితు లను వెంటనే హాస్పిటల్‌లో చేర్చడం వలన వారిని ప్రాణాపాయం నుండి రక్షించవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం గుడ్ సమారిటన్ చట్టం తీసుకుని వచ్చిందని ఈ చట్టప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని మొదటి గంటలో దగ్గరలోనే హాస్పటల్‌కి తరలించి అతని ప్రాణాలు కాపాడిన వ్యక్తిని గుడ్ సమారిటన్‌గా గుర్తించి తగిన పారితోషకం అందిస్తారన్నారు. ఆదివారం రేపల్లె,పెటేరు గ్రామంకు చెందిన జె.శ్రీనివాసరావు,జె.శివ పార్వతి లకు తీవ్ర గాయాలు అవడంతో విధులలో భాగంగా అటుగా వెళుతున్న చీరాల టూ టౌన్ సిఐ జి.సోమశేఖర్ వెంటనే స్పందించి క్షతగాత్రులను తన పోలీస్ వాహనంలో ఎక్కించుకొని హుటాహుటిన చీరాల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, సిబ్బంది సహాయంతో హాస్పిటల్‌లో చేర్పించారు. పోలీసు వారు స్పందించిన తీరు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.